

వీరఘట్టంలో ఉరుములు ,మెరుపులతో వర్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత తట్టు కోలేక అల్లాడిపోతున్న తరుణంలో గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. భారీగా కురుస్తున్న వర్షానికి రహదారులు మురికి నీటితో నిండుకున్నాయి.



వీరఘట్టంలో భారీగా కురుస్తున్న వర్షం

అల్లూరి ఆశయ సాధనకు కృషి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పలుచోట్ల ఘనంగా సీతారామరాజు వర్ధంతి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల పక్షాన నిలబడి బ్రిటీష్ వారితో పోరాడి ప్రాణాలు అర్పించిన అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని గొరడలో అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల దోపిడీ నిరంకుశ పాలనపై తిరుగుబాటు జెండా ఎగరవేసి దేశానికి నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు రావాలని కలలగన్న మహావీరుడని కొనియాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని, గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కార్పొరేట్ సంస్థలు కంపెనీల పేరుతో గిరిజనులను అడవి నుంచి దూరం చేసే పరిస్థితి ఉందన్నారు. హక్కులు, చట్టాల పరిరక్షణకు ప్రతి గిరిజనుడు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోలక అవినాష్, మండంగి శ్రీనివాసరావు, పువ్వల తిరుపతిరావు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

సాలూరు : డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తన నివాస గృహంలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అలాగే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి ఆమె నివాసంలో జరిగిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల ఆగడాలను ఎదురించి పోరాడిన యోధుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతి రావు, పట్టణ నాయకులు బందాపు సతీష్ పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా మండలంలోని బాలగొడబలో గిరిజన యువత ఆధ్వర్యంలో నిర్మించిన సీతారామరాజు విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనులపై బ్రిటీష్ పాలకుల దాష్టీకాన్ని ఎదురించిన అతిచిన్న మరణించిన సీతారామరాజు ఎందరికో ఆదర్శంగా నిలచారని, అటువంటి మహనీయుల విగ్రహాలను గ్రామంలో స్థాపించడమే కాకుండా, వారి జీవితం నుంచి స్ఫూర్తిపొందాలని అన్నారు. కార్యక్రమంలోబూర పోలమ్మ, ఉపసర్పంచ్ వి.శ్రీనివాసరావు, ఎంపిటిసి వంగపండు నీలవేణి, మాజీ సర్పంచ్ మువ్వల సత్యంనాయుడు, రైతుకూలీ సంఘం నాయకులు కారి గవరన్న, డి.వర్మ, శ్రీనునాయుడు, యువకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం అల్లూరి స్ఫూర్తితో ఉద్యమించాలి

రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై అల్లూరి సీతారాజు స్ఫూర్తితో ఉద్యమించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, రావికోన సర్పంచ్ కద్రక రామస్వామి పిలుపునిచ్చారు. రావికోన, రంగాలగూడలో స్థానిక యువత, సిపిఎం నాయకులతో కలసి అల్లూరి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అటవీ హక్కు చట్టాన్ని అటవీ పరిరక్షణ చట్టంగా తీసుకురావడం గిరిజనులకు తీవ్రంగా నష్టదాయకమన్నారు. గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మార్చే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర, నాయకులు జి.వెంకటరమణ, మాట్లాడుతూ గిరిజనుల మనుగుడే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులపై పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని లిడికివలసలో గిరిజన విద్యార్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించగా, గిరిజన సంఘం నాయకులు, యువతీ యువకులు పాల్గొన్నారు.


పాచిపెంట : మండలంలోని మాతుమూరులో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి గిరిజన సంఘం నాయకులు డి.గంగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుర్రు రామారావు, రైతు సంఘం నాయకులు ముఖీ జగన్నాథం, గొర్రె రామారావు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు షేక్ ఫరీద్, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన వీరులు త్యాగాలతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను అల్లూరి స్ఫూర్తితో కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.



అల్లూరికి నివాళ్లు అర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

కలెక్టరేట్ : స్థానికసుందరయ్య భవనంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి జివి రమణ, శ్రామిక మహిళ నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ ఎవరి పేరు చెబితే బ్రిటీష్ సామ్రాజ్యవాదులు గుండెల్లో గుబులు పుడుతుందో అలాంటి వ్యక్తి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని, ఆయన చూపిన స్ఫూర్తితో యువత, అన్ని వర్గాల ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటానికి ముందు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని ఆదివారం రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బొడ్లపాడు, నడుకూరు గ్రామాల్లో జనసేన నాయకులు వజ్రగడ జానీ, ఎం.పుండరీకం అల్లూరి, ఠాగూర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.








పార్వతీపురం: బాలగొడబలో అల్లూరి విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు; రావికోనలో అల్లూరికి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు, పాచిపెంటలో నివాళ్లు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జగనన్న లేఅవుట్‌పై అసౌకర్యాల నీడ

- అకాల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్
- లబ్ధిదారుల కు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ పేదలకు సంబంధించిన గృహ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న జగనన్న లేఅవుట్ అసౌకర్యాలకు నిలయంగా మారింది. నెలిపర్తి లేఅవుట్-2లో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు రోడ్లు ఛిద్రమయ్యాయి. ఈ లేఅవుట్‌లో మొత్తం 413మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. పట్టణంలోని బంగారమ్మ కాలనీకి సమీపంలో ఉన్న నెలిపర్తి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి లబ్దిదారులు చురుగ్గా ఉన్నారు. అయితే ఇక్కడ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా లబ్దిదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఇనుము, సిమెంట్ వంటి సామాగ్రిని నిర్మాణ స్థలం వద్దకు చేర్చుకోడానికి వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు గుంతలమయం కావడంతో నిర్మాణ సామగ్రి తరలింపు లబ్దిదారులకు కత్తిమీద సాములా తయారయింది. లేఅవుట్ -2లోనే ఇటీవల కురిసిన వర్షాలకు, ఈదురు గాలులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. దీనిపై సంబంధించిన అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో లబ్దిదారులకు ఇళ్ల నిర్మాణం పెద్ద సమస్యగా మారింది. రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీటి సరఫరా వంటి సౌకర్యాలు కల్పించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలకు సంబంధించి టెండర్లను పిలిచినా కాంట్రాక్టరు ఇంకా పనులు ప్రారంభించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్షణమే లేఅవుట్‌లో సమస్యలు పరిష్కరించాలని లబ్దిదారులు కోరుతున్నారు.



కూలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బురదమయమైన రోడ్డు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి కలెక్టరేట్

104 ఎంఎంయూ ఉద్యోగులకు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో డర్రు ఆనందరావు అధ్యక్షతన 104 ఎంఎంయు ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మన్మధరావు మాట్లాడుతూ గతంలో వలె రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా 104 ఎంఎంయు ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నెంబర్ 44, 59 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, ఎంప్లాయిస్ కంట్రిబ్యూషన్‌ను అరవింద్ యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. డిఎస్‌సి, ఆర్ఒఆర్ ద్వారా నియమించబడిన సీనియర్ డ్రైవర్లకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 0-5 , 5-10, పదేళ్ల సర్వీస్ పూర్తయిన వారికి స్లాబ్ సిస్టం ఆటో మెటిక్‌గా అప్డేట్ చేయాలని, ప్రతి నెలా జీతాలు చెల్లించి బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగస్తులకు స్థానిక ప్రదేశాలకు బదిలీలు చేయాలన్నారు. వాహనాలు సకాలంలో క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించి వాహనాలకు ఫిట్నెస్ ఇన్సూరెన్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వాహనాలకు చిన్నచిన్న మరమ్మతులకు గ్రీజు, ఎయిర్ మరమ్మతులకు అడ్వాన్స్ పేమెంట్ ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయుడు, రమణ, 104 ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు

సస్పెన్షన్ ఎత్తివేతపై హర్షం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విధుల్లో నిర్లక్ష్యం వహించారంటూ డిఇఒ ఎస్‌డివి రమణ, పాఠశాల విద్య, అసిస్టెంట్ గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.రోజారమణి సస్పెన్షన్లను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల పలు ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అయితే టెన్త్ ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలబడేందుకు కృషి చేసిన ఎస్ డి వి రమణకు తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు జిల్లా విద్య, శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపల్‌గా పోస్టింగ్ ఇస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాకు సమర్ధులైన బాధ్యత కలిగిన అధికారులను దూరం చేయడం తగదని, ఈ విషయంలో పునరాలోచించాలని యుటిఎఫ్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. అలాగే వారితో సస్పెండ్ అయినా మిగతా ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

మిగతా వారి సస్పెన్షన్లు ఎత్తి వేయాలి

కలెక్టరేట్ : జిల్లా విద్యా శాఖధికారి ఎస్‌డివి రమణ, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి రోజారమణి లను సస్పెన్షన్లు ఎత్తి వేయడం పట్ల జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి హర్షం వ్యక్తం చేసింది. అలాగే ఒకే కారణంపై సస్పెండ్ అయిన మిగిలిన వారి సస్పెన్షన్లను కూడా ఎత్తివాలని సమితి డిమాండ్ చేసింది. వీరఘట్టం ఎంఇఒ, రేగులపాడు కెజిబివి స్పెషల్ ఆఫీషర్ సస్పెన్షన్లను కూడా ఎత్తి వేయాలని సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్‌కు వినతిని ఇవ్వాలని, సస్పెన్షన్లు ఎత్తివేయకపోతే మరో పోరాటాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సమితి నాయకులు పిసి హెచ్.శ్రీనివాసరావు, ఎస్.మురళీ మోహనరావు, కె.విజయ్, ఎన్.బాలకృష్ణ, చంద్రశేఖర్, రెవెన్యూ అసోషియేషన్ నాయకులు శ్రీరామూర్తి పాల్గొన్నారు.



జిల్లా విద్యా శాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రేమ్‌కుమార్ ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును వారి నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి అభినందనలు తెలుపుతూ జిల్లా స్థాయిలో విద్యా విధానం మరింత బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- సాగునీటి వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- గ్రీన్ పాలకొండగా మార్చుతా
- 'ప్రజాశక్తి'తో పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ముఖాముఖి

పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో గల రెవెన్యూ, సాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. ఆరు నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన తాను డివిజన్ పరిధిలో గల 7 మండలాల్లో ఇప్పటికే పలు గ్రామాలను సందర్శించి సమస్యలను గుర్తించానన్నారు. అలాగే డివిజన్లో భూరీసర్వేను మరింత వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి చేపడతానన్నారు. పాలకొండ నగరపంచాయతీని గ్రీన్‌పాలకొండగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. తోటపల్లి కాలువ పనులు, జంపరకోట రిజర్వాయర్ పనులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. డివిజన్లోని గిరిజనుల సమస్యలను గుర్తించానని, ఐటిడిఎ పిఒతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వీటితో పాటు డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై 'ప్రజాశక్తి'కి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు.

- ప్రజాశక్తి, పాలకొండ/పాలకొండ రూరల్



డివిజన్‌లో మీరు గుర్తించిన సమస్యలు ఏమిటి...?


డివిజన్ పరిధిలో ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందడం లేదు. ఏ పాఠశాలకు వెళ్లి విద్యార్థులను ప్రశ్నిస్తుంటే సక్రమంగా జవాబులు చెప్పలేకపోతున్నారు. ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించింది. మధ్యాహ్న భోజన పథకం కూడా సక్రమంగా అమలవుతుంది. అయితే విద్యాబోధన సక్రమంగా లేదు. దీనిపై ప్రత్యేక దృష్టిపెడతాను.

గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించారా?

సీతంపేట మండలంతో పాటు డివిజన్ పరిధిలో గల గిరిజన గ్రామాల్లో గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదు. స్టోరేజీ కేంద్రాలు కూడా లేవు. దీనిపై ఐటిడిఎ పిఒతో కలిసి పూర్తిస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేసి గిరిజనులకు లాభం చేకూర్చేలా చర్యలు తీసుకుంటాను.

రీసర్వే ఎంతవరకు పూర్తయింది?

డివిజన్‌లో 500 గ్రామాల్లో భూరీసర్వే జరగాల్సి ఉండగా మొదటి విడతలో 41 గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. స్టోన్ ప్లాంటేషన్ కూడా చేపడుతున్నాం. ఈ నెలాఖరుకు సంబంధిత రైతులకు సచివాలయాల ద్వారా వెబ్‌ల్యాండ్ రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతుంది. దీనివల్ల భూతగాదాలకు ఆస్కారం ఉండదు.



సాగునీటి ప్రాజెక్టులపై ఎటువంటి దృష్టిపెట్టారు?

తాను వచ్చినప్పటి నుంచి ప్రధానంగా ఉన్న సాగునీటి వనరులపై అధ్యయనం చేశాను. ఈ మండలంలో రైతాంగానికి అవసరమైన జంపరకోట ప్రాజెక్టు పనులపై కూడా క్షుణ్ణంగా పరిశీలించి ఆ నివేదికను ప్రభుత్వానికి అందించడం జరిగింది. అలాగే తోటపల్లి కాలువ పనులపై కూడా ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాను.

నగర పంచాయతీలో పారిశుద్ధ్యంపై ఎలా స్పందిస్తారు?

నగర పంచాయతీలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉన్న మాట వాస్తవమే. కాలువలు సరిగ్గా లేవు. తాను వచ్చినప్పటి నుంచి నగర పంచాయతీలో పలు వార్డుల్లో పర్యటించాను. స్వయంగా సమస్యలు గుర్తించాను. చెత్త తరలించే వాహనం మరమ్మతులకు గురవ్వడంతో పాటు డంపింగ్ యార్డ్ తరలింపు విషయంలో కూడా జాప్యం జరుగుతుంది. దీనిపై నగర పంచాయతీ అధికారులకు ఆదేశించడం జరిగింది. డంపింగ్ యార్డ్ తొందరలోనే పట్టణం నుంచి టిడి పారాపురం వద్దకు మార్చేలా చర్యలు తీసుకుంటాను. గ్రీన్ పాలకొండగా చేసేందుకు కృషి చేస్తాను.

ఇకెవైసితో అవస్థలు

- సిగ్నల్స్ లేక అవస్థలు
- రోజుల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి - కురుపాం

ఇకెవైసితో అవస్థలుపడుతున్నామని మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలోని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం 'ప్రజాశక్తి'తో వారు మాట్లాడుతూ ఈ పంచాయతీ పరిధిలో గిరిజన గ్రామాలు ఎక్కువ ఉన్నాయన్నారు. అందులో 17 పివిటిజి గ్రామాలు కాగా, ఈ గ్రామాలకు ఇంటర్నెట్ సదుపాయం లేక ప్రతి నెలా పంచాయతీ కేంద్రమైన నీలకంఠాపురానికి ఒకటో తేదీ నుంచి 15వ తేదీలో పిలిచి ఇకెవైసి చేసి రిసిప్ట్ ఇస్తున్నారని తెలిపారు. ఏమైనా ఇబ్బందుల వల్ల రిసిప్ట్ తీసుకోక పోతే ఆనెల బియ్యం పోయినట్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల వృద్ధులు, వికలాంగులు, ఇంట్లో వదిలేసి రాలేక చిన్న పిల్లలతో సహా రోజుల తరబడి నిలువనీడలేని డిపో దగ్గర గంటల తరబడి ఎదురుచూస్తూ తీవ్ర అష్ట కష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎండాకాలంలో డిపో వద్ద కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నా మని తెలిపారు. ఐదేళ్ల క్రితం దండుసూరగూడలో రైస్ డిపో నిర్మించినప్పటికీ ఇప్పటికీ అది నిరు పయోగంగానే మిగిలిపోయిందన్నారు. వెంటనే దీన్ని ప్రారంభించి అక్కడ కొన్ని గ్రామాలకు బియ్యాన్ని అందించాలని, లేనిచో గ్రామానికి ఒక రోజు చొప్పున కేటాయించి ఆ గ్రామంలో ఎక్కడ సిగ్నల్ ఉంటే అక్కడ ఇకెవైసి చేసి బియ్యం పంపిణీ చేయాలని కోరారు. లేకుంటే ఆఫ్‌లైన్ లో బియ్యం పంపిణీ చేసి తమను ఆదుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.



ఇకెవైసి కోసం డిపో వద్ద నిరీక్షిస్తున్న గిరిజనులు

వెంకట్రావు ఆశయ సాధనకు కృషి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సిపిఎం నాయకులు తాడంగి వెంకట్రావు ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన సిపిఎం నాయకులు తాడంగి వెంకట్రావు, సోదరుడు కృష్ణారావు పదో వర్ధంతి సభ మండలంలోని గొరడలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రెడ్డి వేణు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో సిపిఎం బలోపేతానికి, గిరిజనుల సమస్యలు పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని అన్నారు. వెంకట్రావు అకాల మరణం పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. ఒకే చోట ఇద్దరు అన్నదమ్ములు మృతి చెంది పదేళ్లు గడిచిన లోవముతా ప్రాంతంలోని గిరిజన హృదయాల్లో మంచి వ్యక్తులుగా స్థానం సంపాదించుకున్నారని అన్నారు. కామ్రేడ్స్ జ్ఞాపకార్థం నిర్మించిన స్థూపాలు వద్ద నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోలక అవినాష్, మండంగి శ్రీనివాసరావు, పువ్వల తిరుపతిరావు, మండల నాయకులు పి.గౌరయ్య, కె.దొరబాబు, పి.అసరయ్య, గిరిజనులకు పాల్గొన్నారు.



వెంకట్రావు స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ఎన్నాళ్లు ఇన్‌ఛార్జులపాలన?

- ఒక్కొక్క అధికారి రెండు, మూడు శాఖలకు అదనపు బాధ్యతలు
- పనిభారంతో అవస్థలు

గిరిజనాభివృద్ధి కోసం ప్రభుత్వం సీతంపేటలో ఏర్పాటు చేసిన సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ)లో అధికారుల కొరత సమస్య వేధిస్తోంది. గిరిజనులకు సకాలంలో సేవలందించాల్సిన ఈ సంస్థలో దీర్ఘకాలంగా అధికారుల పోస్టుల భర్తీ కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే స్తంభించిపోతున్నాయి. దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా మారింది. అంతేకాక ఒక అధికారి రెండు, మూడు శాఖల అదనపు బాధ్యతలు చేపట్టడంతో పనిభారంతో తలలు పట్టుకుంటున్నారు. పని ఒత్తిడితో ఏశాఖకు తాము పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నామని మదనపడుతున్నారు. ఏళ్లతరబడి అదనపు బాధ్యతలు నిర్వర్తించడంతో వారు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి - సీతంపేట


స్థానిక ఐటిడిఎకు అనుబంధంగా 22 శాఖలు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా ఇన్‌ఛార్జీలతో నిర్వహిస్తున్నారు. ఐటిడిఎకు వెన్నెముక లాంటి గిరిజన సంక్షేమ శాఖ జిల్లా ఉపసంచాలకులు శ్రీకాకుళంలో జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి బి.నగేష్ ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఇన్‌ఛార్జి బాధ్యతలు వ్యవహరిస్తున్నారు. ఈ శాఖ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో సుమారు 10వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి విద్యతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో మెనూను సక్రమంగా అమలు చేయించడం, విద్యా అభివృద్ధికి కృషి, వసతి గృహాల పర్యవేక్షణ గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సిబ్బంది జీతాలు వంటివి చేయాల్సి ఉంది. దీనికి తోడుగా నాలుగేళ్లుగా ఐటిడిఎ ఉప విద్యాశాఖ అధికారి పోస్ట్ ఖాళీగా ఉంది. డిప్యూటీ డిఇఓకు అదనంగా ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈశాఖ పరిధిలో 257 పాఠశాలలను పర్యవేక్షించాలి. ఇది తలకు మించి భారం అవుతుంది. ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి పోస్ట్ ఖాళీగా ఉండటంతో జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.సత్యనారాయణ రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ అధికారి పరిధిలో ఏడు మండలాల్లో ఉద్యానశాఖ అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంది. రైతులతో మాట్లాడి జీడి మామిడి, ఇతర పంటలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలి. అంతేకాక ఐటిడిఎకు సంబంధించిన పథకాలు, రాయితీలు అందించాలి. జిల్లా కేంద్రంలో ఉంటూ ఐటిడిఎ కేంద్రంలో పనిచేయాలంటే కష్టం అవుతుంది. పాలకొండ హార్టికల్చర్ అధికారి అమరేశ్వరి సీతంపేట హార్టికల్చర్ అధికారిగా ఇన్చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈమె పరిధిలో ఐదు మండలాలు ఉండడంతో ఉద్యానవనాలకు సంబంధించి రైతులకు సహకారం అందించాలి. దీంతో ఎటూ న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. సీతంపేట మండల విస్తరణ అధికారి కొండపల్లి సత్యం ఎంపిడిఒగా ఇన్‌ఛార్జి బాధ్యతలతో పాటు పక్కనే ఉన్న పాలకొండ ఇఒపిఆర్‌డిగా కూడా ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తూ సీతంపేట ఇన్చార్జి ఎంపిడిఒగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఎంపిడిఒ గీతాంజలి శిక్షణకు వెళ్లారు. అలాగే సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావుకు భామిని మండలం ఇన్‌ఛార్జి ఎంఇఒగా వ్యవహరిస్తున్నారు. అంతేకాక భామిని మండలంలో ప్రాథమిక పాఠశాలలతో పాటు సీతంపేట హైస్కూలు విద్య నిర్వహణ చూడాల్సి ఉండడంతో తలనొప్పిగా మారింది. మల్లి ప్రతిభ కళాశాల ప్రిన్సిపల్ ఎం.యుగంధర్ సీతంపేట పిఎంఆర్‌సి ఎడ్యుకేషన్ ఒఎస్‌డిగా ఇన్చార్జి బాధ్యతలు వ్యవహరిస్తున్నారు. ప్రతిభ కళాశాల బాధ్యతలు చూస్తూ పిఎంఆర్‌సి ఎడ్యుకేషన్ ఒఎస్‌డిగా అదనపు బాధ్యతలతో జిపిఎస్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభివృద్ధి డ్రాప్స్ నివారణ ఎడ్యుకేషన్ వ్యవహారాలు నిర్వహిస్తున్నారు. అలాగే వెలుగు డిపిఎం రమణ ఇన్చార్జి ఎపిడిగా వ్యవహరిస్తున్నారు. ఏడు మండలాలకు సంబంధించి మహిళా సంఘాల బ్యాంక్ లింకేజీ ఆసరా వంటి పథకాలు మహిళలకు అందించాలి. అలాగే వందన్ వికాస కేంద్రాల నిర్వహణ, సమావేశాలు, తదితర బాధ్యతలు ఉంటాయి. ఐటిడిఎ అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ విజయరాణి, ఇన్చార్జిగా మేనేజర్‌గా వ్యవహరించడంతో దేనికీ న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది. అకౌంటు మేనేజర్ పోస్టు ఖాళీగా ఉంది. ఐటిడిఎలో గణాంక, ఉపగణాంకాల అధికారుల పోస్టు ఖాళీగా ఉండడంతో ఐటిడిఎ పరిపాలన ఎలా నెట్టుకొస్తున్నారో అధికారులకు ఎరుక. ఇన్ని పోస్టులు ఖాళీలతో ఐటిడిఎ పరిపాలన ఏవిధంగా ముందుకు వెళ్తుందో వేచి చూడాల్సి ఉంది.


సీతంపేట ఐటిడిఎ కార్యాలయం


స్పీకర్ తమ్మినేనిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, వైసిపి నాయకులు


స్పీకర్ తమ్మినేనిని సత్కరించిన ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్: స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పార్వతీపురం మీదుగా రాయగడ మజ్జి గౌరమ్మను దర్శించుకునేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన్ను పార్వతీపురం శివారులో గల కొత్తవలసలో ఉన్న ఆంజనేయ స్వామి కోవెల వద్ద స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు నియోజకవర్గ వైసిపి నాయకులతో కలిసి ఆయనను మర్యాద పూర్వకంగా కలుసుకొని గజమాలను వేసి దుస్సాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కౌన్సిలర్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఎమ్మెల్యేకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానం

పార్వతీపురంటౌన్ : ఈనెల 30న పార్వతీపురం గ్రామ దేవత అయిన ఇప్పల పోలమ్మ తల్లి పండగ సందర్భంగా ఉత్సవ సభ్యులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును మర్యాదపూర్వకంగా కలుసుకొని పండగకు ఆహ్వానించి, అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. అలానే పండగ విజయవంతానికి సహాయ, సహకారాలు అందజేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం టిట్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ నివాస గృహానికి వెళ్లి గ్రామ దేవత పండగకు ఆహ్వానించి, సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బెలగాం జయప్రకాష్ నారాయణ, బర్నాల సీతారాం, గుసిరి కాశీరాజు, మండల గణపతి రావు, కందుకూరి ప్రభాకరరావు, లాయర్ కాళిదాస్, మండల సత్తిబాబు, మండల బాబు, తదితరులు పాల్గొన్నారు.


రైతులనుద్దేశించి మాట్లాడుతున్న జికెఎఫ్ అధినేత పాషా

పర్యావరణ పరిరక్షణకు రైతులు ముందుకు రావాలి

మక్కువ : పర్యావరణం పరిరక్షణకు రైతుల భాగస్వామ్యం ఎంతైనా అవసరమని అందుకోసం రైతులంతా ముందుకు రావాలని జికెఎఫ్ అధినేత పాషా పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని టీకలావలో కార్బన్ క్రెడిట్‌పై భాగస్వామ్యమైన రైతులు స్మార్ట్ సంస్థ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో పాషా మాట్లాడుతూ ఇంకా ఎవరైనా రైతులు నమోదు కాకపోతే వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ చేసి భూగోళాన్ని భద్రంగా ఉంచాలని రైతులకు సూచించారు. తర్వాత రైతులు జిల్లా అంతటా ఈ కార్యక్రమాన్ని విస్తరింపజేయాలన్నారు. 2023 పూర్తి అయ్యేనాటికి 1500మంది రైతులు భాగస్వామ్యమే లక్ష్యంగా పని చేస్తామని స్మార్ట్ సంస్థ సిబ్బంది హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జికెఎఫ్ రీజనల్ కోఆర్డినేటర్ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు


సాహస క్రీడ చేస్తున్న చిన్నారి

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ఆదివారం సెలవు దినం అందులో వేసవి సెలవులు కావడంతో పర్యాటకులు సందడి చేశారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో తల్లిదండ్రులు కుటుంబీకులతో పిల్లలు కాసేపు పార్కు వద్ద సేద తీరారు. విహారయాత్రకు పర్యాటకులు జిల్లా నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా తరలించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. కమాండ్ నెట్ ఎక్కి ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు.

గ్రంథాలయంలో వేసవి శిబిరాలు

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరాల్లో చదువు, క్రీడలు ఇతర విజ్ఞాన పరమైన పరిజ్ఞానం కల్పించేందుకు 40 రోజుల పాటు సాగనున్నాయని గ్రంథాలయాధికారి బి.గణేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పుస్తక పఠనం, చిత్ర లేఖనం, మట్టితో బొమ్మలు, పేపర్ క్రాఫ్ట్, అల్లికలు ఎలా తయారు చేయాలో నేర్పడం జరుగుతుందన్నారు. ఎవరైనా విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వక్తలు, పట్టభద్రులైన యువత, పురస్కార గ్రహీతలు సాహితీవేత్తలు ముందుకొచ్చిన చిన్నారులకు విజ్ఞానం అందించాలని కోరారు.

సిరిమానోత్సవానికి అంజలి రథం సిద్ధం

వీరఘట్టం: మండల కేంద్రంలో గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9న నిర్వహించనున్న సిరి మహోత్సవానికి అంజలీరథం సిద్ధమైంది. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని ఉత్సవ కమిటీ సభ్యులు అంజలి రథాన్ని గ్రామాల్లో తిప్పేందుకు తుది మెరుగులు దిద్దుతున్నారు.


అంజలి రథాన్ని సన్నద్ధం చేస్తున్న నిర్వాహకులు

తిని బండారాలు రహదారులపై వేయరాదు

మండల కేంద్రంలో పైడితల్లి అమ్మవారి జాతరలో భాగంగా తినుబండారు రహదారిపై వేయరాదని స్థానిక పశువైద్యాధికారి పి.చైతన్యశంకర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి పదార్థాలు తినడం వల్ల పశువులు అనేక వ్యాధులకు గురై మృత్యువాతపడతాయని వీటిని దృష్టిలో పండక్కు వండిన పదార్థాలు ఏవీ రోడ్డుపై వేయరాదని ప్రజలకు సూచించారు.


రాజన్నదొరకు ఆహ్వానం పలుకుతున్న గిరిజనులు

గిరిజన సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

గడపగడపకు కార్యక్రమంలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి -సాలూరురూరల్

రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం తమదేనని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. ఆదివారం ఆయన గడపగడపకూ ప్రభుత్వంలో భాగంగా మండలంలోని కొట్టుపరువు, కొత్తవలస గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. అంతకుముందు గ్రామంలోకి ఆయన చేరుకోగానే గిరిజనులు ఘనస్వాగతం పలికారు. గిరిజన మహిళలు చేసిన థింసా నృత్యంలో ఆయన కూడా అడుగు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంతకుమారి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సర్పంచులు నర్సింహులు, పి.సుదర్శనరావు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బలిజిపేట

పదో తరగతి ఫలితాల్లో వంతరాం, బలిజిపేట జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ ఫలితాలు సాధించారు. మండలంలోని అంపావల్లికి చెందిన డి.ఉమామహేశ్వరి వంతరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి మండలంలో 582 మార్కులతో మండలంలోని టాపర్‌గా నిలిచింది. చిలకలపల్లికి చెందిన సంకు ఉమామహేశ్వరి బలిజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 581 మార్కులతో ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించింది. ఈ సందర్భంగా వంతరాం, బలిజిపేట ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు, ఎం.రాజేశ్వరి, ఉపాధ్యాయులు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు.


ఉమామహేశ్వరి (582)

అనుమతి వచ్చిన వెంటనే తప్పుల సవరణ

ప్రజాశక్తి - మక్కువ

భూ సర్వే నెంబర్లలో తప్పొఒప్పులకు సంబంధించి ప్రభుత్వం కంప్యూటర్‌లో అనుమతి ఇచ్చిన వెంటనే సరి చేస్తామని తహశీల్దార్ ఎ.సూర్యనారాయణ అన్నారు. ఆదివారం జగనన్నసమగ్ర భూ సర్వేలో భాగంగా మార్కొండపుట్టి పంచాయతీ పెదఘెసిల రెవెన్యూ పరిధిలో జరుగుతున్న హద్దుల రాళ్లను ఆయన పరిశీలించారు. భూ హద్దులకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తహశీల్దార్ సూర్యనారాయణ సిబ్బందికి తెలిపారు. రైతుల మధ్య ఎటువంటి తగాదాలకు తావు లేకుండా సర్వే జరగాలని రైతుల మధ్య సమస్యలుంటే తమ వద్దకు తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. సర్వేలో భాగంగా తహశీల్దార్‌తో సహా మండల సర్వేయర్ పి.లింగమూర్తి, రీ సర్వేడిటి జి.హేమలత హద్దురాళ్లను అమరుస్తున్న భూముల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమకు వచ్చిన పాస్ బుక్కులు తప్పులుగా ఉన్నాయని తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లగా మరల చెక్ చేసుకుని సరైన పాసుబుక్కులు అందజేస్తామని రైతులతో అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్వే అసిస్టెంట్ మనీషా, అరుణ్ గ్రామ విఆర్ఒ తిరుపతిరావు గ్రామ రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ సూర్యనారాయణ


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కిశోర్

జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ యూనియన్ ఏర్పాటు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పార్వతిపురం మన్యం జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యూనియన్ ఏర్పాటు ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో జరిగింది. జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రఘుకుమార్, డాక్టర్ వినోద్, ఎపి ఎన్‌జిఒ సంఘ అధ్యక్షులు జివి కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా సిహెచ్ జగదీష్, కార్యదర్శిగా ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా రాజేశ్వరి, కోశాధికారిగా జాకబ్‌ను ఎన్నుకున్నారు. ఈ సంధర్భంగా జిల్లా డాక్టర్ రఘు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ అధికారుల అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలోని వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించారు. 5వతరగతి ప్రవేశంతో పాటు 6, 7, 8, 9 తరగతిల్లో ఖాళీ సీట్లలో ప్రవేశాలకు పరీక్ష జరిగినట్టు చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.తిరుపతిరాజు తెలిపారు. పరీక్షల పరిశీలకులు బి.కైలాసరావు, ఇన్విజిలేటర్ బిడ్డిక కాంతి కుమార్ వ్యవహరించారు. ఐదో తరగతికి 125 మంది దరఖాస్తులు చేయగా, 112 మంది పరీక్ష రాశారు. ఆరో తరగతికి 99మంది దరఖాస్తు చేయగా, 87 మంది, 7వ తరగతికి 14 మంది, 8వ తరగతి ఆరుగురు, పరీక్షకు హాజరయ్యారన్నారు. 9వ తరగతికి ఎవరూ పరీక్షకు హాజరు కాలేదన్నారు.

వాహనాల దారి మళ్లింపు

సీతానగరం: మండలంలో సోమవారం నుంచి సీతానగరం, పెదబోగిలి, బుడ్డిపేట, అప్పయ్యపేట, జోగమ్మపేట గ్రామాల్లో భోగితల్లి పండుగ సంధర్భంగా వాహనాలను దారి మళ్లిస్తున్నామని ఎస్ఐ కె. నీలకంఠం అన్నారు. పండగను పురష్కరించుకుని ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం ఘటాల ఊరేగింపు, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం ముగింపు ఉత్సవం ఉంటుందన్నారు. సిరిమాను తిరిగే ప్రాంతాల్లో, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే స్థలాల్లో పోలీస్ సిబ్బంది ఉండి పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. సిరిమాను తిరిగే సమయంలో భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులకు భక్తులు, స్థానికులు పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. కమిటీ సభ్యులు వివరించిన మేరకు వాహనాలు పార్కింగ్ చేయాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ సిబ్బందికి సహకరించి సజావుగా పండుగ జరిగేలా చూడాలని కోరారు. పండుగకు వచ్చే భక్తులు విలువైన బంగారు ఆభరణాలు ధరించి, డబ్బులతో సిరిమాను తిరిగే సమయంలో, ప్రోగ్రాంలు జరిగే ప్రాంతాల్లో తిరగవద్దని కోరారు. విద్యుత్ వైర్లు ఉండే దిగువున ఉండవద్దని సూచించారు. సిరిమాను తిరిగే సమయంలో పాడుబడిన మేడలు, మిద్దెలు, గోడలు ఎక్కి వీక్షించవద్దని సూచించారు. సిరిమాను సంబరం జరిగే మంగళవారం పోలీస్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు మళ్లింపునకు సహకరించాలని కోరారు. సీతానగరం- అజ్జాడ రూటు వాహనాలను మరిపివలస మీదుగా మళ్ళించడం జరుగుతుందని, దీనికి వాహనదారులు, ప్రయాణికులు సహకారాన్ని అందించాలని కోరారు. అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటామని

గెడ్డలుప్పిలో 'ఇదేం కర్మ'

సీతానగరం: మండలంలోని గెడ్డలుప్పిలో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం టిడిపి ఇంచార్జి బొబ్బిలి చిరంజీవులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందన్నారు. ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారని చెప్పారు. ప్రజలపై భారాల మోపి అరాచకం పెరిగిపోయిందన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు వెంకట నాయుడు, మండల అధ్యక్ష కార్యదర్శులు కె. తిరుపతిరావు, ఆర్ వేణుగోపాలనాయుడు, ఆర్ సింహాచలం, ఎం శంకర్రావు, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


మృతి చెందిన దాదాసాహెబ్

మద్యంమత్తులో ఆయుర్వేద వైద్యుడు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మద్యం మత్తులో వాటర్‌పైపుపై పడి ఓ ఆయుర్వేదిక్ వైద్యుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం శ్రీకాకుళం జిల్లా కొత్తూరుకు చెందిన ఆయుర్వేదిక వైద్యుడు మొగల్ దాదాసాహెబ్ (58) గ్రామాలకు వెళ్లి ఆయుర్వేదిక్ వైద్యం చేస్తూ జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వెళ్తుండగా సీతంపేట సచివాలయ సమీపంలో కాలుజారి వాటర్ పైపుపై జారి పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో ఉదయం స్థానికులు దాదాసాహెబ్ మృతి చెంది ఉండడాన్ని చూసి కుటుంబీకులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి దాదాసాహెబ్ భార్య చేరుకొని సీతంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎ.నీలకంఠరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాదాసాహెబ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

10 మందిపై కేసు నమోదు

సీతంపేట : మండలంలోని మర్రిపాడులో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తున్న 10మంది నిర్వాహకులపై ఎస్ఐ నీలకంఠం కేసు నమోదు చేశారు. శుక్రవారం రాత్రి మర్రిపాడు గ్రామస్తులు ఒడిశా నుంచి కొంతమంది మహిళలను, పురుషులను తెప్పించి గ్రామస్తులకు ఇబ్బంది కలిగించేలా అశ్లీల నృత్యాలు, పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ అసౌకర్యం కలిగించారు. దీంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు నిర్వాహక కమిటీ సభ్యులు పదిమందిపై పోలీసులు కేసు నమోదు చేశారు .

'పుచ్చ'లో పోషకాలు పుష్కలం

ప్రజాశక్తి -కురుపాం

వేసవి తాపం మొదలైంది అంటే వేడి నుంచి ఉపశమనం కోసం కొబ్బరి నీరు, చెరకు, పండ్ల రసాలు సేవిస్తుంటాం. వేసవితాపం నుంచి ఉపశమనం పొందడానికి, శరీరాన్ని శాంతబర్చుకోడానికి పుచ్చకాయలు ఎంతగానో ఉపయోగపడతాయి. నీటి శాతం అధికంగా ఉండే పుచ్చకాయలో పొటాషియం, ఎలక్ట్రోలైట్లు అధికంగా లభిస్తాయి. వీటిని ఎంత ఎక్కువగా ఆహారంగా తీసుకున్నా క్యాలరీల బాధ ఉండదు. బరువు తగ్గాలనుకునేవారు. పుచ్చకాయలను ఎక్కువగా తినడం మంచిది. పుచ్చకాయలో ఉండే లైకోపీన్ అనే పదార్థం పురుషుల్లో వీర్యకణాల ఉత్పత్తిని పెంచుతుంది. పుచ్చ గింజల్లోనూ అనేక పోషకాలు ఉన్నాయి. వీటిలో విటమిన్-బి అధికంగా ఉంటుంది. వీటిని తినడం వల్ల గుండె జబ్బుల సమస్య నుంచి బయటపడొచ్చు. వీటి గింజలను ఆహారంగా తీసుకోవడం వల్ల మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. ఈ గింజలను నీటిలో మరిగించి 'టీ'లా తాగడం వల్ల కిడ్నీల్లో ఏర్పడిన రాళ్లు కరిగిపోతాయి. జ్ఞాపకశక్తి వృద్ధికి, ఏకాగ్రత పెంచుకోడానికి, కండరాల కదలికల క్రమబద్ధీకరణకు పుచ్చ గింజలు దోహదపడతాయి. మధురమైన 'పుచ్చ'సరిగ్గా వేసవి నాటికి అందుబాటులోకి వస్తుంది. పుచ్చకాయనే స్థానికంగా 'కర్బూజా' అని కూడా పిలుస్తారు. మన దేశంలో రైతులు దీన్ని ఉద్యాన పంటగా సాగుచేస్తారు.

మెండుగా పోషకాలు

వేసవిలో దాహం తీర్చుకోడానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చేది ఎర్రని పుచ్చ, ఇది అన్ని సీజన్లలోనూ దొరుకుతున్నా... ఒక్క వేసవిలో లభ్యమయ్యే వాటి నాణ్యత, రుచి అధికం. 'బి' విటమిన్లు, పొటాషియం పుష్కలంగా ఉండే ఈ పుచ్చకాయలో ఎలెక్ట్రోలైట్లు సమృద్ధిగా అందుతాయి. 'బి' విటమిన్లు శరీరానికి శక్తినందిస్తే... పొటాషియం గుండెకు మేలు చేస్తుంది. వడదెబ్బ బారినపడి శరీరం నిస్తేజం అయిపోకుండా పుచ్చకాయ కాపాడుతుంది. వేడికి కమిలిన చర్మానికి చల్లని పుచ్చకాయ గుజ్జును రాస్తే చర్మం తిరిగి నిగారింపును సంతరించుకుంటుంది. ముదురు ఎరుపు లేక గులాబీ రంగు ఉన్న పుచ్చకాయ గుజ్జులో జెరోటినాయిడ్స్, బీటా కెరోటిన్లు పుష్కలంగా లభ్యమౌతాయి. వీటిని మన శరీరం 'ఏ' విటమిన్లుగా మారుస్తుంది. వీటితో పాటు విటమిన్ 'బి6', విటమిన్ 'సి', పీచు పదార్థాలు కూడా లభ్యమవుతాయి. మిగిలిన వాటి కన్నా ఇందులో నీటి శాతం ఎక్కువ, సుక్రోజ్తో పాటు ఫ్రక్టోజ్, గ్లూకోట్లు అందులో లభిస్తాయి.


మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

ఆరోగ్యానికి కర్బూజా ఎంతో ఉపయోగకరం

కర్బూజా కేవలం సీజనల్ ఫ్రూట్ మాత్రమే కాదు. దీన్ని ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు. ఇందులో కాల్షియం, సోడియం, మెగ్నీషియం, పొటాషియం, క్లోరిన్, కెరోటిన్, రకరకాల విటమిన్లు ఉన్నాయి. శరీరంలో కాల్షియం నిల్వ సామర్థ్యాన్ని పెంచి కీళ్ల నొప్పుల్నీ, వాత రోగాన్ని నియంత్రిస్తుంది. మూత్రంలోని యూరిక్ ఆమ్లాన్ని తగ్గిస్తుంది. ఎన్నో రకాల ఖనిజ లవణాలున్న కర్బూజా పండు బాలింతలకు తినిపిస్తే బాగా పాలు పడతాయి, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలోనూ ఈ పండు సాయపడుతుంది.



బి .ప్రజ్ఞ, వైద్యాధికారిణి ,
మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.